క్లుప్తంగా

భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు రూరల్: జాతీయ రహదారి భద్రతా వాసోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ 2024 సంవత్సర జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల స్లోగన్‌ను రహదారి భద్రత – మనందరి బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసిందన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

మృతుని కుటుంబానికి బీమా నగదు అందజేత


బీమా నగదు అందజేస్తున్న నాయకులు

పామూరు: స్థానిక కరెంట్ ఆఫీస్‌కాలనీకి చెందిన వేముల ఏడుకొండలు (36) సోమవారం రాత్రి గుండె పోటుతో మృతిచెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాలో సభ్యుడు కావడంతో మృతుని కుటుంబసభ్యులకు మంగళవారం వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్.ఖాజాషరీఫ్‌లు మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుని భార్య వేముల అనితకు అందజేశారు. ఎంపీటీసీ షేక్.నాసర్‌బీ, 16వ వార్డు సభ్యులు షేక్.నాయబ్‌రసూల్, వేముల రమణయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కనులపండువగా శోభాయాత్ర


వేములపాడులో శోభాయాత్ర

హనుమంతునిపాడు: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మండల పరిధి వేములపాడులో మంగళవారం రాత్రి శ్రీరామచంద్రుని శోభాయాత్ర వైభవంగా సాగింది. ఈ సందర్భంగా జైశ్రీరామ్ అంటూ యాత్ర సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన


గోకులంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేపిస్తున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: మండలంలోని గోకులం, గన్నవరం గ్రామాల్లో ఎంపీడీఓ టి.సుకుమార్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.సుకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. రైతులు పొలాలకు మందు ఎలా స్ప్రే ఎలా చేయాలో డ్రోన్ సహాయంతో డెమో ద్వారా వివరించారు. ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడం ఆదిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోపాడులో వేట సాగిస్తే కఠిన చర్యలు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో చేపలవేట సాగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ అధికారి షేక్.మహమ్మద్‌సుబాని తెలిపారు. మోపాడు రిజర్వాయర్‌లో అనధికారికంగా చేపలు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, లీజు ఉత్తర్వులు, ఫిషింగ్ పర్మిట్లు లేకుండా చేపలు పట్టడం నేరమని, లీజు ఉత్తర్వులు వచ్చే వరకు చేపలు పట్టవద్దని ఆయన ఆదేశించారు.

ఇంటి వద్దకే వైద్యం

వలేటివారిపాలెం: మండలంలోని జెడ్ ఉప్పలపాడులో మంగళవారం వలేటివారిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు ప్రారంభించారు. గ్రామంలో 35 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఇద్దరు గర్భిణులను పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం వైద్యశాలలో కాన్పు చేయించుకోవాలని సూచించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: ఉలవపాడులోని అంబేద్కర్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు పరీక్షలు చేశారు. మొత్తం 152 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. బీపీ, సుగర్ పరీక్షలు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కనిగిరి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని ఎంపీడీఓ జేబీబీ మల్లికార్జున రావు అన్నారు. మండలంలోని గోసులవీడు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మూలే గోవిందారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో వైద్యులు ఎస్‌కే దాదా షరీఫ్, ఎస్‌కే ఆయేషా, జి.మాధురి, ఎన్ వెంకటేశ్వర్లు వైద్య సేవలందించారు. సుమారు 256 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందచేశారు. ఏఓ ఫ్రాన్సిస్ బాబు, పంచాయతీ కార్యదర్శి బాలస్వర్ణ, వైద్య సిబ్బంది ఎస్తేరు రాణి, ఎస్‌కే జిలానీ, కళ్యాణి, ప్రసాద్‌రెడ్డి, రమణమ్మ, ఇమ్రాన్, అమీర్ బాషా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులున్నారు.

సీఎస్‌పురం(పామూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి భరోసానిస్తోందని ఎంపీడీఓ సీహెచ్. రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సీఎస్‌పురం వడ్డెపాలెం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం డాక్టర్ సందిరెడ్డి మురళి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, రవికుమార్, డాక్టర్ ఎస్.మురళి, డాక్టర్ ఎంవీవీఎస్. రాజేష్‌లు 303 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఎంపీటీసీలు దేవరాజ్, మాల్యాద్రి, వాసు, పీఎస్‌లు రాంప్రసాద్, వాణి, సీహెచ్‌ఓ ఎం వెంగయ్య, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీరామ లక్ష్మీకాంతమ్మ, హెచ్‌ఈ కె.కొండయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సీఎస్‌పురంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీడీఓ, డాక్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.లలిత, మెడికల్ అధికారి సందీప్ అన్నారు. ముప్పాళ్లపాడు సచివాలయ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో సోమవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ కె.లలిత, సర్పంచ్ కొటికల అంకాలమ్మ, ఎంపీటీసీ దేవమ్మ, వైద్యులు సందీప్, డాక్టర్ నిసర్‌బేగం ,హెచ్‌ఎం కుడారి రామోహన్‌రావు, కార్యదర్శి శ్రావణ సంధ్యా, సీహెచ్‌ఓ, కేవీ చెన్నయ్య పాల్గొన్నారు.

గుడ్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజశేఖరరావు అన్నారు. మండలంలోని పోట్లూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ పులిపాటి ఈశ్వరయ్యతో కలిసి ఎంపీడీఓ మంగళవారం ప్రారంభించారు. వైద్యాధికారి మారుతీరావు మాట్లాడుతూ స్పెషలిస్టు డాక్టర్లు భార్గవ్(ఆర్థో), సుబ్బారావు(జనరల్), హర్షవర్ధన్‌రెడ్డి, సర్తాజ్ (కంటివైద్యులు) వైద్య శిబిరంలో 473 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు.


ముప్పాళ్లపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్


వైద్య శిబిరంలో కళ్లు జోళ్లు అందచేస్తున్న అధికారులు

కనిగిరి నియోజకవర్గ ఓటర్లు 2,37,057

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల ఓటర్ల తుది జాబితాను ఎన్నికల అధికారి(ఈఆర్వో), ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ విడుదల చేశారు. ఓటర్ల జాబితా వివరాలను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించాలని మంగళవారం బీఎల్వోలను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదుల మేర పూర్తిస్థాయిలో విచారణ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని కనిగిరి మున్సిపాలిటీతో పాటు, ఆరు మండలాల్లోని 297 పోలింగ్ బూత్‌లలో 2,37,057 మంది ఓటర్లు కాగా అందులో పురుషుల ఓట్లు 1,19,906, మహిళల ఓట్లు 1,17,136గా తుది జాబితాలో ఉన్నట్లు తెలిపారు.


పాలపర్తి జాన్ ఇర్విన్, ఆర్డీఓ

ఓటర్ల జాబితా వివరాలు, మండలాల వారిగా..

మండలం	పురుషులు,	మహిళలు,	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు
హెచ్‌ఎం పాడు,	11,760	11226	0	22,986
వెలిగండ్ల,	14,363	13622	0	27,985
సీఎస్‌పురం	17,207	16681	2	33,890
కనిగిరి	36,302	35606	12	71,920
పీసీపల్లి	14,724	14255	1	28,980
పామూరు	25,550	25746	0	51,296
మొత్తం	1,19,906	1,17,136	15	2,37,057

దద్దాల సభను విజయవంతం చేయాలి


వెలిగండ్లలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, కన్వీనర్, జెడ్పీటీసీ

వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల నారాయణయాదవ్ నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో కనిగిరిలో బుధవారం జరిగే సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిగిరి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా దద్దాల నారాయణయాదవ్‌ను ప్రకటించిన తర్వాత మొట్టమొదటగా కనిగిరికి వస్తున్నారన్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ పొల్లా సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ దళిత నాయకులు కటికల వెంకటరత్నం, మండల బీసీ సెల్ నాయకులు యెలికె రమణయ్య, గుడిపాటిపల్లి ఎంపీటీసీ పి.నాగేశ్వరరావు, హుస్సేన్‌పురం ఎంపీటీసీ దేవిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నాయకులు చిలకల నారాయణరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, రామన భాస్కర్‌రెడ్డి, తమ్మినేని శివరామయ్య, గురుబ్రహ్మం, దద్దాల రాములు, మేడం ఆదిరెడ్డి, పాణ్యం మురళి, వేల్పుల తిరుపతయ్య, కేటీఎల్ నాయుడు, బాలయ్య పాల్గొన్నారు.

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల నారాయణ యాదవ్ బుధవారం నియోకవర్గానికి రానున్న సందర్భంగా కనిగిరి పవిత్ర కన్వెన్షన్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్న, పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్సీపీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు తమకు శిరోధార్యమని, ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల నారాయణకు తమ పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. మూలె రాజశేఖర్, ఎంపీటీసీ కొండారెడ్డి, సర్పంచ్ నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు దద్దాల నారాయణ రాక

● భారీ స్వాగత ఏర్పాట్లు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల నారాయణ బుధవారం తొలిసారి కనిగిరికి రానున్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు డాక్టర్ దద్దాల నారాయణకు స్థానిక నందనమారెళ్ల వద్ద భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. 24న ఉదయం 9:30 గంటలకు కనిగిరి మండలంలోని నందనమారెళ్ల వద్ద ఉన్న బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా పట్టణంలోకి ప్రవేశించి చెక్‌పోస్టు వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న బాబు జగజ్జీవన్‌రావు విగ్రహానికి, గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న జ్యోతిరావు పూలే, కబీర్ దాస్, గుర్రం జాషువ విగ్రహాలకు నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక పవిత్రా కల్యాణ మండపానికి చేరుకుంటారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ కార్పొరేషన్ల డైరక్టర్లు, వైఎస్సార్ సీపీ అభిమానులు, పార్టీ శ్రేయోభిలాషులంతా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

హనుమంతునిపాడు: కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. హనుమంతాపురం, లింగవగుంట్ల, వేములపాడు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే సిబ్బంది మీ ఇళ్లకు వచ్చినపుడు సహకరించి సర్వేకు సంబంధించి అడిగిన వివరాలు చెప్పాలని కోరారు. పంచాయతీల విస్తరణ అధికారి షేక్ షరీఫ్, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, వలంటీర్లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కుల గణన సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో జరిగిన కుల గణన సర్వేను మంగళవారం చైర్మన్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కుల గణన సర్వేలో సచివాలయ సిబ్బంది, అధికారుల, వలంటీర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సర్వేకు పట్టణ ప్రజలంతా సహకరించాలని కోరారు. సర్వే తీరును పరిశీలించి సూచనలిచ్చారు. కులగణన సర్వే ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో భాగంగా వార్డులోని ప్రజలకు పారిశుధ్యంపై మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అవగాహన కల్పించారు.

సీఎస్‌పురం(పామూరు): కులగణన సర్వే పారదర్శకంగా, పకడ్బందీగా సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు అన్నారు. మండలంలోని నల్లమడుగుల, కోవిలంపాడు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కుల గణన సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు. కులగణన వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదుచేసే ప్రక్రియలో సచివాలయ సిబ్బంది పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా చేయాలన్నారు.

రెజ్లింగ్‌లో టీఆర్ఆర్ విద్యార్థి ప్రతిభ

కందుకూరు రూరల్: కాకినాడ జిల్లా పీఠాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 21 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో కళాశాలకు చెందిన బీఏ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.రాజేంద్ర సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాల్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సీహెచ్.శంకరరావు, కళాశాల ఫిజకల్ డైరెక్టర్ కేఆర్.కరుణకుమార్‌లు విద్యార్థిని అభినందించారు.

మిరప పంట పరిశీలన

కందుకూరు రూరల్: కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు మండలంలోని అనంతసాగరంలో సాగు చేసిన మిరప పంటను మంగళవారం పరిశీలించారు. మిరపలో సమగ్ర సస్యరక్షణ ద్వారా పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై చేపట్టిన ప్రదర్శనా క్షేత్రాన్ని సందర్శించి రైతు అభిప్రాయాలను సేకరించారు. పై ముడత కింద ముడత, కాయకుళ్లు తెగుళ్ల నివారణకు తగు సూచనలు చేశారు. కాయకుళ్లు నివారణకు కాబ్రియోటాప్ మందును ఏకరాకు 600గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కనిగిరి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయంలో 11,12 వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతనంగా వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులను చైర్మన్ గఫార్ చేతుల మీదుగా అందచేశారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ఎందరికో రక్షణ, భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవాన్ని టీవీలో ప్రజలతో కలిసి చైర్మన్ గఫార్ వీక్షించారు. కౌన్సిలర్ దాసరి మురళీ, సచివాలయ, వైద్య శాఖ అధికారులు, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు,స్థానికనాయకులు పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

నేతాజీ ఆశయాలు అనుసరణీయం

పామూరు: నేతాజీ ఆశయాలు అనుసరణీయమని కేజీబీవీ ఎస్‌ఓ కటకం సజన, ప్రజాసంఘాల నాయకుడు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక కేజీబీవీలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లేయులపైకి దూసుకొచ్చిన ఓబుల్లెట్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం, బొట్లగూడూరు, కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నేతాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం 3 పాఠశాలలకు నేతాజీ విగ్రహ దాత మల్లికార్జున నాయుడిను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సయ్యద్ ఇసాక్, ఏఓ వాణి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పీవీ కృష్ణమోహన్, అస్సాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాట ధీరుడు సుభాష్ చంద్రబోస్

కనిగిరి రూరల్: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీటీసీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ కృషిని కొనియాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మండాది కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు దానం నాగేంద్రారెడ్డి, ముద్దాబాబు, బ్రహ్మారెడ్డి, శ్రీహరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, నాయకులు మూలే మాలకొండారెడ్డి, ఏడుకొండలురెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.


చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

నూతన ఓటర్ల జాబితా సక్రమమే

సింగరాయకొండ: నూతనంగా ప్రచురించిన ఓటరు జాబితా సక్రమంగా ఉందని ఎటువంటి అవకతవకలు లేవని కొండపి నియోజకవర్గ ఇఆర్‌ఓ బి. నారదముని అన్నారు. కలికవాయలో ఓటరు జాబితాకు సంబంధించి ఇంటింటి విచారణ మంగళవారం నిర్వహించారు. ఇఆర్‌ఓ నారదముని మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్ల తొలగింపులు 2 శాతం మాత్రమే ఉండాలన్నారు. కానీ కలికవాయలోని పోలింగ్ బూత్ నెంబర్లు 224,225,226 లో 20 నుంచి 30 శాతం వరకు ఓటరు జాబితాలో తొలగింపులు జరిగాయని దీనిపై గ్రామంలో ఇంటింటి విచారణ జరిపి ఓటర్లతో స్వయంగా మాట్లాడానని వివరించారు. గతంలో ఒక కుటుంబంలోని వారు ఒక పోలింగ్ బూత్‌లో కాకుండా మూడు పోలింగ్ బూత్‌లలో ఉన్నాయని ఇప్పుడు వారందరినీ ఫారం–8 ద్వారా ఒక పోలింగ్ బూత్‌కు మార్చామన్నారు. దీనివల్ల ఆయా పోలింగ్ బూత్‌లలో భారీగా వ్యత్యాసం కనిపించిందని అంతేతప్ప ఎటువంటి అవకతవకలు జరగలేదని అంతా సక్రమంగా ఉందని వివరించారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, ఇఓ ఆంజనేయులు, ఆర్ఐ ప్రవీణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వీరేంద్ర పాల్గొన్నారు.

పోటీలకు హాజరుకావాలి

లింగసముద్రం: నియోజకవర్గస్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు క్రీడాకారులు హాజరుకావాలని ఎంపీడీఓ శేషుబాబు కోరారు. బుధవారం నుంచి కందుకూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆటలపోటీలు నిర్వహిస్తామన్నారు. బ్యాడ్మింటన్ పోటీలు మాత్రం కోటారెడ్డినగర్‌లోని లయన్స్‌క్లబ్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. మండలస్థాయిలో గెలుపొందిన జట్లలోని క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో జరిగే ఆటలపోటీలకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయిలో గెలుపొందిన క్రికెట్ జట్టు విజేతలకు ఎంపీడీఓ శేషుబాబు, సర్పంచ్ పులి పెదరాఘువు క్రికెట్ కిట్‌ను అందజేసి అభినందనలు తెలిపారు.


క్రికెట్ జట్టుకు కిట్‌ను అందజేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సింగరాయకొండ: గ్రానైట్ లోడ్ టిప్పర్ వాహనాన్ని వెనుక వేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా మరో మహిళకు, కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జాతీయరహదారిపై కందుకూరు ఫ్లెటైవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..తిరుపతికి చెందిన పి.శేషావతి(55) తెలంగాణ రాష్ట్రం నల్గొండలో ప్రమాదానికి గురైన తన అల్లుడిని పరామర్శించేందుకు బంధువు ఇగువ వెంకటమ్మతో కలిసి వెళ్లి తిరుగు ప్రయాణంలో కారు కందుకూరు ఫ్లెటైవర్ దిగుతుండగా డ్రైవర్ నిద్రమత్తులో ముందు వెళ్తున్న ట్రిప్పర్‌ను బలంగా ఢీ కొట్టడంతో కారు టిప్పర్ కిందభాగంలో ఇరుక్కొని ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో శేషావతి, వెంకటమ్మలకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ కె.మాధవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వీరిని 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శేషావతి మృతి చెందగా, వెంకటమ్మకు మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై టి.శ్రీరాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకుతరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


టిప్పర్ వెనకభాగాన్ని ఢీకొన్న కారు

ముగిసిన షాపుల అద్దె వేలంపాట

కందుకూరు: కందుకూరు పురపాలక సంఘం పరిధిలోని రైతు బజారు పక్కన ఉన్న పాత లారీ స్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల అద్దె వేలం పాట మంగళవారం కమిషనర్ ఎస్.మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. షాపు నెంబర్ 1, 2, 3 (ఎస్సీ)లకు షాపు నెంబర్ 7 (నాయి బ్రహ్మణ అండర్ వాషర్‌మెన్‌లకు), షాపు నెంబర్ 8, 9 (టీఎల్‌ఎఫ్/ఎస్ఎల్‌ఎఫ్)లకు షాపు నంబర్ 4, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 (జనరల్)లకు కౌన్సిల్ తీర్మానం చేశారు. దీని ప్రకారం నిర్వహించిన వేలంలో షాపు నెంబర్ 1 (ఎస్సీ)లకు, 8, 9 (టీఎల్ ఎఫ్/ఎస్ఎల్ఎఫ్)లకు, 4, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 (జనరల్)లకు హెచ్చు పాట పాడుకొని దక్కించుకున్నారు. ఈ పాటలను కౌన్సిల్ ఆమోదం తరువాత షాపులు కేటాయిస్తామని కమిషనర్ తెలిపారు. మిగిలిన షాపులు నెంబర్ 2, 3 (ఎస్సీ)లకు, 7 (నాయి బ్రహ్మణ అండర్ వాషర్‌మెన్)లకు వేలంపాటలో ఎవరు పాల్గొనలేదు. సదరు షాపులకు ఈ నెల 27వ తేదీ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనేందుకు ధరావత్తు రూ.50వేలు, సాల్వేన్సీ లేక ప్రాపర్టీ పత్రం నిమిత్తం రూ.2 లక్షల దాఖలు పరచాలన్నారు.


వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్

స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు

కొండపి (సింగరాయకొండ): కొండపి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్ ప్రారంభించి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ తెరపిస్ట్ కోర్సుల్లో మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన యువత ఈ శిక్షణ కు అర్హులని ఇతర వివరాలకు 8897964505, 9666203005 నంబర్లను సంప్రదించాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం. గోపికృష్ణ వివరించారు.

నేడు ఆడుదాం ఆంధ్ర పోటీలు

కొండపి (సింగరాయకొండ): సింగరాయకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆడుదాం–ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యంవీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు ఈఆర్‌ఓ బి. నారదముని కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. విజేతలకు రూ. 5.10 లక్షల రూపాయల పారితోషికాలు అందజేస్తామన్నారు.

జేసీబీ వాహనం సీజ్


పాలేరు నదిలో అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్న జేసీబీ

జరుగుమల్లి: మండల పరిధిలోని పాలేరు నదిలో కె. బిట్రగుంట వద్ద అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్న జేసీబీని సెబ్, మైన్స్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. నదిలో ఇసుక తరలించి డంప్ చేస్తున్నందున స్వాధీనం చేసుకున్నామని సెబ్ ఎస్సై దయాకర్ తెలిపారు. సెబ్ సీఐ నరహరి, జేడీ టీం వంశీధర్, డీటీయఫ్ ఎస్ఐ శ్రీనివాసులు, మైన్స్ తిరుపతిరావు, స్థానిక వీఆర్‌ఓ బబ్బూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

20 బాటిళ్ల మద్యం స్వాధీనం

టంగుటూరు: మిడసల సుధాకర్ అక్రమ మద్యం అమ్ముతుండగా పలు రకాల 180 ఎంఎల్ 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని ఎస్సై ఖాదర్ బాషా మంగళవారం తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచునున్నట్లు తెలిపారు.